క్లుప్తంగా

మల్లన్న పాగా తయారీ ప్రారంభం



పాగా తయారీని ప్రారంభిస్తున్న చేనేత కార్మికులు

మెళియాపుట్టి: శ్రీశైలం భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి వారికి సమర్పించే పాగా తయారీని సోమవారం ప్రారంభించినట్లు చాపర గ్రామానికి చెందిన చేనేత కార్మికులు తెలిపారు. తయారు చేసిన అనంతరం శివరాత్రికి స్వామివారికి సమర్పించనున్నట్లు తెలిపారు. దేవాంగుల వీధిలో దీనిని తయారు చేస్తున్నామని బత్తల శంకరరావు, మానెం దండాశి, ధనుంజయ, ముఖలింగం, కొల్ల ధర్మారావుతో పాటుగా పలువురు పాల్గొన్నట్లు తెలిపారు.

రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు



గాజులకొల్లివలసలో రైతుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: తుఫాన్ ప్రభావం వల్ల రైతులకు ఎటువంటి నష్టం రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహన్ రావు అన్నారు. మండలంలో గాజులకొల్లివలస గ్రామంలో గల రైతుల నుంచి ధాన్యాన్ని సమీపంలో గల రైస్‌మిల్లులకు సోమవారం తరలింపు చేపట్టారు. వర్షానికి ధాన్యం తడిసి పోకుండా రైతులకు తగిన ఏర్పాట్లును చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగానే రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటను మిల్లులకు తరలించడం జరుగుతుందన్నారు. రైతుల నుంచి ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు కురవడంతో రైతులు తమ పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సురక్షిత ప్రాంతాలు లేకుంటే రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించుకోవచ్చునని తెలిపారు.

వైద్య రంగానికి పెద్దపీట



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: పేదలందరికీ ఉచితంగా వైద్యాన్ని అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని మడపాంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మడపాంలో గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.1.43 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. వంశధార నదికి వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన మెట్లును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సర్పంచ్ ఎరుకోడు, ఎంపీటీసీ రువ్వ వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు, సతివాడ రామినాయుడు, అల్లు అసిరినాయుడు పాల్గొన్నారు

లక్ష్యాలను చేరుకోవాలి

మెళియాపుట్టి: ఉపాధి హామీ పనుల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, కొలతల ప్రకారం నిర్దిష్ట వేతనం లభించేలా పనులు చేయాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని సుందరాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించారు. రెండుపూటలా పనులు చేయడం ద్వారా పూర్తిస్థాయి వేతనం లభిస్తుందన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బిజయ్ పండి పాల్గొన్నారు.

పాతపట్నం: మండలానికి నిర్దేశించిన ఉపాధి పని దినాల కల్పనలో లక్ష్యాలను నూటికి నూరు శాతం చేరుకోవాలని ఉపాధి క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఏపీఓలకు డ్వామా పీడీ చిట్టిరాజు సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. పంట కాలువల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అన్ని పంచాయతీల్లో డిసెంబర్ 20వ తేదీ నాటికి కనీసం 25 రోజుల పని దినాలు పూర్తిచేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్ల శిక్షణ తరగతుల్లో పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, ఏపీఓ సురేష్, జేఈ రవికుమార్ పాల్గొన్నారు.

సారవకోట: ఉపాధి పథకం ద్వారా గట్లుపై నాటిన మొక్కల నిర్వాహణ బాధ్యత మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తీసుకోవాలని డ్వామా పీడీ చిట్టిరాజు సూచించారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 నాటికి ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి పనులు పూర్తిచేయాలని, ఇప్పటివరకు వచ్చిన జాబ్ కార్డులను పంపిణీ చేయాలన్నారు. ఈసీ జయరాం, ఏపీఓ నారాయణరావు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: మోదుగువలస శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సారవకోట: మండల కేంద్రంలోని శివాలయంలో బారులు తీరిన భక్తులు



కొత్తూరు: కూర్మదాసుపురం శివాలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

శంభో.. శివ శంభో

కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జామునుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయాల వద్ద శివనామస్మరణ మార్మోగింది. విశేష పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, ఆలయ కమిటీ ప్రతినిధులు చర్యలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: శ్రీముఖలింగం ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలు అందుకుంటున్న మధుకేశ్వరస్వామి



ఆమదాలవలస రూరల్: గాజులకొల్లివలసలో పూజలు అందుకుంటునన సంగమేశ్వరస్వామి



పాతపట్నం: నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురం ఉమాకామేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

అన్నదాత ఆవేదన

మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల సోమవారం వర్షం కురిసింది. ఇప్పటికే గ్రామాల్లో వరి కోతలు జరిగాయి. చాలా మంది రైతులు యంత్రాల సాయంతో నూర్పిడి చేసి ధాన్యాన్ని పొలాల్లోనే అరబెట్టడానికి సిద్ధం చేశారు. ఈ సమయంలో అకాల వర్షం కురవడంతో తీవ్రనష్టం కలుగుతుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. చాలా గ్రామాల్లో వరి కోతలు చేయడం వల్ల వరి పనలు నీటిలోనే ఉన్నాయి. వర్షంతోపాటు గాలులు వీయడం వల్ల పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. పంట పొలాల్లో ఉన్న వరి చేనును కాపాడుకోవడానికి రైతులు నిమగ్నమయ్యారు. పొలాల్లో నీటిని బయటకు తీయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కోతలు పూర్తి చేసిన రైతులు వరి కుప్పలు పెట్టడంతో వాటిపై పరదాలు కప్పి పంటను రక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: తోటాడలోని కళ్లాల్లో టార్పాలిన్లు కప్పి ఉంచిన ధాన్యం



ఆమదాలవలస రూరల్: చెవ్వాకులపేటలో నెలకొరిగిన వరి పంట



సరుబుజ్జిలి: తురకపేట వద్ద తడిచిన వరి ఓవులు



నరసన్నపేట: రావులవలస వద్ద ధాన్యం రాసులపై కప్పిన టార్పాలిన్లు



నరసన్నపేట: గుండవల్లిపేట వద్ద వరి కుప్పపై కప్పిన టార్పాలిన్



పోలాకి: గుప్పెడుపేట తీరంలో ఒడ్డుకు చేర్చిన బోట్లు

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

సారవకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని గొర్రిబంద, జగ్గయ్యపేట, కోనవానిపేట, అగుతుపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. పార్టీ, కులం, మతం చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, సర్పంచ్‌లు జన్ని అనిరుద్రుడు, కొండాల బాబూరావు, బాడాన కృష్ణారావు, శంకర బాబు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, జేఏసీ కన్వీనర్ నక్క తులసీదాస్, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, పొన్నాన మోహన్‌రావు, సోమేశ్వరరావు, ఎంపీడీఓ రాంబాబు, ఈఓపీఆర్డీ రేణుక, ఏఓ వెంకటరావు, ఏఈలు రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్.ఎన్.పేట: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన తరువాత పరిపాలన వికేంద్రీకరణ తీసుకువచ్చారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల వద్దకు పరిపాలన వచ్చిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు గడపగడపకు వెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకుని వాటిని పరిష్కరించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలను నాడు–నేడు కార్యక్రమం ద్వారా సరికొత్తగా తీర్చిదిద్దారన్నారు. వైఎస్సార్ చేయూత, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ, సున్నా వడ్డీ రుణాలు, వైఎస్సార్ చేయూత, దిశ యాప్ ద్వారా మహిళలకు ఎంతో భరోసాను కల్పించారన్నారు. జగనన్న కాలనీ లే అవుట్లతో కొత్త గ్రామాలు పుట్టుకొస్తున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మరిన్ని రోగాలకు వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య ఆసరా, రైతు భరోసా, బీమా వంటి పథకాలతో రైతులను ఆదుకున్నది సీఎం జగన్ ఒక్కరే అని అన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ జగనన్నను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ నాయకుల మాయమాటలు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి



సరుబుజ్జిలి: బూర్జ మండలం కాలపర్తిలో అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు



నరసన్నపేట: మడపాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం నరసన్నపేట మండలం మడపాం, బూర్జ మండలం కాలపర్తి సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. గ్రామ కూడళ్లల్లో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

– నరసన్నపేట, సరుబుజ్జిలి

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



ఎం.ఎల్.పురంలో రైతుల ధాన్యాన్ని పరిశీలిస్తున్న టెక్కలి సబ్ కలెక్టర్

హిరమండలం: రైతులు తమ వద్ద ఉన్న ధాన్యం రైస్ మిల్లులకు తరలించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అధికారులకు ఆదేశించారు. ఆయన సోమవారం మండలంలోని ఎంఎల్ పురం ఆర్‌బీకే పరిధిలో ఉన్న రైతుల ధాన్యంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావం తీవ్ర ప్రభావం ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు వద్ద ఉన్న ధాన్యంను కొనుగోలు చేయాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, లేదా రైస్ మిల్లులకు తరలించాలన్నారు. మండలంలోని 20 మంది రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలించారు. తహసీల్దార్ మురళీమోహన్, ఏఓ సంధ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



జలుమూరు: పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ నరసమ్మ

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగం గ్రామానికి చెందిన దుప్పల మల్లేశ్వరరావు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ బిర్లంగి అప్పల నరసమ్మ సోమవారం సుమారు 45 కిలో మీటర్లు దూరం వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

రిమ్స్‌కి వెళ్లి..

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామానికి చెందిన ఉర్జాన లక్ష్మీమ్మ అనారోగ్యంతో శ్రీకాకుళంలోని రిమ్స్‌లో వైద్యం పొందుతున్నారు. గ్రామ వలంటీర్ యజ్జల వినోద్‌కుమార్ 60 కిలో మీటర్ల దూరంలో ఉన్న రిమ్స్ ఆస్పత్రికి సోమవారం వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేశారు.



కొత్తూరు: పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ వినోద్‌కుమార్

సచివాలయ సిబ్బందికి శిక్షణ

పాతపట్నం: ప్రతీ ఉద్యోగి తన కర్తవ్య నిర్వహణలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, విధులను పీఆర్, ఆర్‌డీ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ వివరించారు. మండల పరిషత్, ఉపాధి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు ఇస్తున్న శిక్షణ తరగతులను సోమవారం పరిశీలించారు. మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ తెలిపారు. ఈఓపీఆర్డీ కృష్ణారావు, మిశ్రో, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

రూ.34 కోట్లతో ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగ మురళి

నరసన్నపేట: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.34 కోట్లతో 7.62 లక్షల పనిదినాలు కల్పించేందుకు సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించారు. పంచాయతీల వారిగా నిర్వహించిన గ్రామ సభల వివరాల మేరకు మండల బడ్జెట్‌ను రూపొందించగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన నిర్వహించారు. పారశిల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో గ్రామ సభ కూడా నిర్వహించలేదని ఎంపీటీసీ పంగ శ్రీరాములు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని ఏపీఓ యుగంధర్ తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశామని రైతులు వినియోగించుకోవాలని ఏఓ కె.సునీత కోరారు. తుఫాన్ కారణంగా మంగళవారం వరకు ఆఫ్‌లైన్‌లో ధాన్యం తీసుకుంటామన్నారు. మిల్లర్లు అదనంగా ధాన్యం అడుగుతున్నారని దేవాది సర్పంచ్ మంతిన రాము అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నాణ్యతగా ఉన్న ధాన్యానికి అదనంగా అడిగితే ఫిర్యాదు చేయాలన్నారు. మండలంలో మరో 1,300 జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తికావాల్సి ఉందని గృహ నిర్మాణ శాఖ ఏఈ శంకరరావు తెలిపారు. జల్ జీవన్ పథకంలో భాగంగా మండలంలో 22 వేల గృహాలకు ఇంటింటికీ కుళాయిలు ఇవ్వాలని లక్ష్యంగా పనులు చేపడుతున్నామని, ఇప్పటి వరకు 9 వేల ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్‌భాస్కర రావు తెలిపారు. కొత్తగా మరుగుదొడ్లు కావాల్సిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ, నరసన్నపేట, ఉర్లాం సర్పంచ్‌లు బూరల్లి శంకర్, పోలాకి నర్సింహమూర్తి, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, ఎంపీడీఓ మధుసూదన రావు పాల్గొన్నారు.

అతిథి దేవోభవ



ఒడిశా రాష్ట్రం పూరీలో జరుగుతున్న అంతర్జాతీయ సైకతశిల్ప కళా ఉత్సవాల్లో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంటుంది. అంతర్జాతీయ సైకత శిల్ప కళ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస ప్రాంతానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి హరికృష్ణ పాల్గొని నాలుగో రోజు అతిథి దేవోభవ అర్థంపై సైకత శిల్పాన్ని అందంగా తీర్చిదిద్దాడు. అతిథులు దేవునితో సమానంగా భావించాలని తెలిపేలా సైకతశిల్పం రూపొందించాడు.

– ఆమదాలవలస రూరల్